

శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు

నగరం: శ్రావణ శనివారం పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసునికి విశేష పూజలు చేశారు.



వెండి వస్తువులు వితరణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి హైదరాబాద్‌కి చెందిన మల్లంపల్లి రాజశేఖర రావు, విశాలక్ష్మి దంపతులు వెండి వస్తువులను కమిటీ సభ్యులు నరేష్‌కి అందించారు.



శనీశ్వరుడికి పూజలు

మంగళగిరి: పట్టణంలోని శివాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో శనీశ్వరుడికి భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

స్పష్టమైన విధానాలతో విజన్-2047 యాక్షన్ ప్లాన్



గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వికసిత్ భారత్‌లో భాగంగా గుంటూరు జిల్లా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్య ప్రణాళికాధికారి శేషశ్రీ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి శనివారం ప్లానింగ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పీయూష్ కుమార్ నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి ఆమె వర్చువల్ విధానంలో మాట్లాడారు. విజన్-2047 ప్లాన్‌పై ఇప్పటికే అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించామని తెలిపారు. దీన్ని పర్యవేక్షించేందుకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచనలతో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

తెనాలి: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఆదివారం గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2024 తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ దగ్గర్లోని క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని నిర్వాహకురాలు, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ ఘట్టమనేని సాయి రేవతి ఒక ప్రకటనలో తెలియజేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు రేపల్లె విద్యార్థి



రేపల్లె రూరల్: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రేపల్లెకు చెందిన బొలిశెట్టి ప్రేమ్‌సాయి ఎంపికయ్యాడు. పట్టణంలోని శ్రీపొట్టి శ్రీరాములు ప్రాథమిక పాఠశాలలో 3వతరగతి చదువుతున్న ప్రేమ్‌సాయి బోధిధర్మ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతూ జూలై 19, 20 తేదీలలో రేపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ కనపరచి బంగారు పతకాన్ని సాధించాడు. ఆగస్టు 18వ తేదీన ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగశైలజ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బొలిశెట్టి శశి భూషణరావు, ఉపాధ్యాయులు క్రీడాకారుడుకు అభినందనలు తెలిపారు.

సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ వద్ద శనివారం రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. రెండు క్రస్ట్‌గేట్లు 8 అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉండగా.. ఇది 312.0450 టీఎంసీలకు సమానం. సాగర్ నుంచి కుడి కాలువకు 8,298, ఎడమ కాలువకు 8,022, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 29,354, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 72,994 క్యూసెక్కులు వచ్చి చేరుతుండటంతో అంతే మోతాదులో సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 7814 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 330, బ్యాంక్ కెనాల్‌కు 1875, తూర్పు కెనాల్‌కు 760, పశ్చిమ కెనాల్‌కు 270, నిజాంపట్నం కాలువకు 450, కొమ్మమూరు కాలువకు 3200 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.



హరిలో రంగ హరి..

అంతా అవినీతే మరి !

- గుంటూరు నగరపాలక సంస్థలో అవినీతి బాగోతం
- ఇన్‌చార్జి కమిషనర్ పాలనపై విమర్శలు
- ఆరోపణలు ఎదుర్కొంటున్న 21 మంది సిబ్బందికి క్లీన్‌చిట్
- 14 రోజుల వ్యవధిలో రూ.20 కోట్లు బిల్లులు మంజూరు
- ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేత
- లక్షల్లో చేతులు మారినట్లు ఆరోపణలు

వైఎస్సార్ సీపీ పాలనలో ఉన్న గుంటూరు నగరపాలక సంస్థపై ఆధిపత్యాన్ని సాధించేందుకు , టీడీపీ నేతల బిల్లులు మంజూరు చేసేందుకు ఇన్‌చార్జి కమిషనర్‌గా ఇటీవల కూటమి ప్రభుత్వం ఎస్. హరికృష్ణను నియమించింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అవినీతికి పాల్పడిన పలువురు ఉద్యోగులకు గత ప్రభుత్వం సస్పెన్షన్‌తో షోకాజ్ నోటీసులు, ఆర్టికల్ చార్జెస్‌ను జారీ చేసింది. ఇన్‌చార్జి కమిషనర్ రాగానే వీటన్నింటినీ తొలగిస్తూ 13వ తేదీ రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పధ్నాలుగు రోజుల వ్యవధిలో కోట్ల రూపాయల బిల్లుల్ని మంజూరు చేశారు. ఆయన హయాంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనంతా చక్కబెట్టుకుని ఆయన ఇటీవల నగరపాలక సంస్థ నుంచి బదిలీ పేరిట తట్టాబుట్టా సర్దేశాడు.

నెహ్రూనగర్: ఇన్‌చార్జి కమిషనర్ ఏలుబడిలో గుంటూరు నగరపాలక సంస్థపై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌చార్జి కమిషనరా.. మజాకా ! అన్నట్లు ఉంది ఆయన పనితీరు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఫైళ్లకు కాళ్లు వచ్చాయి. బిల్లులన్నీ క్లియర్ అయిపోయాయి. ఇటీవల ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. హరికృష్ణ రికార్డ్ స్థాయిలో ఏ కమిషనర్ చేయనంతగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ ప్రాసెస్ చేశారు. ఉద్యోగుల సస్పెన్షన్, షోకాజ్ నోటీసులు, ఆర్టికల్ చార్జెస్‌ను తొలగిస్తూ 13వ తేదీ రాత్రి ఉత్తర్వులు జారీ చేయడం ఆరోపణలకు ఊతమిస్తోంది. దీని వెనుక భారీ మొత్తంలో నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది. అంతా చక్రం తిప్పి నగరపాలక సంస్థ నుంచి బదిలీల్లో మూటా ముల్లె సర్దేశారు.



గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం

చక్రం తిప్పిన కమిషనర్

కమిషనర్ ఎఫ్ఏసీ (పూర్తి అదనపు బాధ్యతలు) అంటే అత్యవసర పనులకు మాత్రమే హాజరవుతారు. గతంలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన శరత్, చెరుకూరి శ్రీధర్, సీడీఎంఏ కోటేశ్వరరావులు ఎఫ్ఏసీగా పని చేశారు. పరిపాలన సౌలభ్యం నిమిత్తం అత్యవసరమైతే ఫైల్స్ ఆమోదం తెలిపేవారు. కానీ టీడీపీ ప్రభుత్వం రాగానే సీన్ రివర్స్ అయింది. తమ పార్టీ నేతలకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తోంది. దీనికి అనుగుణంగా అధికారుల్ని నియమిస్తోంది. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ సెక్షన్లలో పెండింగ్‌లో అన్ని ఫైల్స్‌ను ఇన్‌చార్జి కమిషనర్ ప్రాసెస్ చేసినట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

భారీగా ముడుపులు

సస్పెన్షన్‌కు గురైన సిబ్బందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు, షోకాజ్ నోటీసులు, ఆర్టికల్ చార్జెస్ తొలగించేందుకు నగరపాలక సంస్థ అధికారులు భారీ మొత్తంలో ముడుపులు స్వీకరించినట్లు తెలుస్తోంది. ఐదుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు 16 మందిపై ఉన్న షోకాజ్ నోటీసులు, చార్జెస్ ఫ్రేమ్‌లు పూర్తిగా తొలగించి క్లీన్‌చిట్ ఇచ్చేశారు.

విచ్చలవిడిగా ఓసీల జారీ

టౌన్ ప్లానింగ్ విభాగంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీలో గత కమిషనర్ కీర్తి చేకూరి జాగ్రత్తగా వ్యవహరించేవారు దీర్ఘకాలికంగా ఫైల్స్‌కు ఆమోదం తెలపకపోవడంతో ఓసీలు జారీ కాలేదు. ఇన్‌చార్జి కమిషనర్ రాగానే వాటిన్నంటికీ మోక్షం కలిగాయి. వాస్తవానికి కమిషనర్ స్థాయిలో క్షేత్ర స్థాయి పర్యటన చేసి ఓసీ జారీ చేయాలి. అవేవి చేయకుండానే 20కి పైగా ఓసీలు జారీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

తిరస్కరించిన ఫైల్స్‌కు ఆమోదం

గుంటూరు నగర కమిషనర్‌గా 2022 నుంచి కీర్తి చేకూరి రెండున్నరేళ్ల పాటు విధులు నిర్వహించారు. ఆ సమయంలో పలు అవినీతి ఆరోపణలు, ఆర్థిక సంస్థలలో ముడిపడి ఉన్న సిబ్బందిని ఆమె సస్పెండ్ చేశారు. పలువురికి షోకాజ్ నోటీసులతో పాటు ఆర్టికల్ చార్జెస్ ఫ్రేమ్ చేశారు. నెల రోజుల కిందట కమిషనర్ కీర్తి చేకూరి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాజమండ్రి కమిషనర్‌గా పనిచేస్తున్న దినేష్‌కుమార్‌ను నగర కమిషనర్‌గా బదిలీ చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన విధుల్లో చేరలేదు. దీంతో ఆర్డీఎంఏగా పని చేస్తున్న ఎస్. హరికృష్ణకు నగర కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన బాధ్యతలు చేపట్టగానే నగరపాలక సంస్థలో పనులు ఆగమేఘాల మీద జరిగిపోయాయి. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను 500 నుంచి 600 దాకా అప్రూవ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

కౌన్సిల్‌లో ప్రొటోకాల్ రగడ



నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ కార్పొరేటర్ల వాగ్వివాదం

- కార్పొరేటర్లకు తెలియకుండానే అభివృద్ధి పనులు
- అధికారులను నిలదీసిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
- రూ.3.23కోట్ల సొమ్ము దుర్వినియోగం కాకుండా అడ్డుకున్న కార్పొరేటర్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారం మారిపోగానే అధికారులు కార్పొరేటర్లకు కనీస సమాచారం ఇవ్వకుండానే అన్ని పనులు చేసుకుంటున్నారు.. కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదంటూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షతన శనివారం కౌన్సిల్ హాలులో నిర్వహించారు. తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, రామాంజనేయులు, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కె.ఎస్. లక్ష్మణరావు పాల్గొన్నారు. ముందుగా వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి చనిపోయిన వారికి, కోల్‌కతాలో హత్యాచారానికి గురైన మెడికల్ విద్యార్థినికి సంతాపం తెలియజేశారు.

అధికారం మారిపోగానే మారిన అధికారులు

కనీసం స్థానిక కార్పొరేటర్‌కు తెలియకుండానే నగరంలో అధికారులు అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నారని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు రామనబోయిన అజయ్, ఇర్రి ధనలక్ష్మి, అచ్చాల వెంకటరెడ్డి, ఇతర కార్పొరేటర్లు పట్టుపట్టారు. కనీసం ఆగస్టు 15న సచివాలయంలో జెండా ఎగురవేసేందుకు స్థానిక కార్పొరేటర్‌ను పిలవకపోవడం సిగ్గుచేటని ఖండించారు. వేరేవాళ్లని తీసుకువచ్చి జెండా ఆవిష్కరణ చేశారని కార్పొరేటర్ బూసి రాజలత ఆరోపించారు. అధికారం మారిపోగానే అధికారులు కూడా మారిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హోర్డింగ్స్ నిర్వహణపై ఎంక్వయిరీ వేయాలి

నగరంలో హోర్డింగ్స్ నిర్వాహణలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్‌లు మండిపడ్డారు. నగరంలో అనధికారికంగా హోర్డింగ్స్‌లు, బోర్డులు ఏర్పాటు చేస్తున్న వారి నుంచి బకాయిలు వసూలు చేయడం లేదంటూ ఆరోపించారు. ప్రతి కౌన్సిల్‌లో హోర్డింగ్స్‌పై ప్రశ్నలు వేయడం..అధికారులు సమాధానం ఇవ్వడం తప్పా బకాయిలు వసూలు లేదని మండిడ్డారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఏజెన్సీల నిర్వాహకులతో లాలూచీ పడుతున్నారని ఆరోపించారు. నగరంలో జెయింట్ హోర్డింగ్స్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండానే ఏజెన్సీలు ఏర్పాటు చేస్తున్నాయని, అధికారులు కూడా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వీటి బకాయిలు కూడా రూ. కోట్లల్లో పెండింగ్‌లో ఉన్నాయని, వసూలులో కూడా అధికారులు ఉదాసీనత కనపరుస్తున్నారని ఆరోపించారు. ఓ ప్రైవేట్ ఏజెన్సీ ట్రాఫిక్ సిగ్నల్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ రూ.3.23కోట్లు ప్రియాంబుల్ పెట్టడంపై కార్పొరేటర్లు అడ్డుకున్నారు. మేయర్ కావటి కలగజేసుకుని, దాన్ని విరమించుకుంటున్నట్లు చెప్పారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో హోర్డింగ్స్ నిర్వహణపై టౌన్‌ప్లానింగ్ అధికారులు, ప్రశ్నలు అడిగిన సభ్యులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేస్తానన్నారు. తప్పు ఎక్కడైనా జరిగినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. అజెండా పూర్తి కాకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది



గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

గర్జించిన తెల్లకోట్లు

- రోడ్డెక్కిన వైద్య విద్యార్థులు
- జిల్లావ్యాప్తంగా ఆస్పత్రుల మూత
- కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యను నిరసిస్తూ బంద్
- గుంటూరులో వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ
- న్యాయం జరిగే వరకు పోరాడతామని వెల్లడి
- అత్యవసర వైద్యసేవలకు మినహాయింపు

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం జిల్లావ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రులు మూతపడ్డాయి. అత్యవసర వైద్యసేవలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. ఆస్పత్రుల్ని మూసేసి వైద్యులు, సిబ్బంది రోడ్డుపైకి వచ్చారు. నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబట్టుకుని రోడ్డుపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గుంటూరు లాడ్జి సెంటర్ నుంచి జీజీహెచ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు ఐఎంఏ నేతలు తమ మద్దతు ప్రకటించారు.

శిక్షను పెంచాలి

ర్యాలీని ఉద్దేశించి ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిశోర్ మాట్లాడారు. కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని దేశంలోని మహిళలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. పనిచేసే మహిళలకు రక్షణ కల్పించేందుకు తమతోపాటు అంతా కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. వైద్యులు, సిబ్బందిపై దాడి చేస్తే రెండేళ్ల జైలు శిక్ష పడేలా ఏపీలో యాక్ట్ 11 ఉందని చెప్పారు. దీన్ని ఏడేళ్లకు పెంచి నాన్ బెయిల్‌బుల్ పెట్టాలని డిమాండ్ చేశారు. నిర్భయ చట్టం తెచ్చినా మహిళలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠిన చట్టాల్ని తీసుకురావాలని కోరారు.

అమానుషం

ఐఎంఏ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ మాట్లాడుతూ డాక్టర్లను దేవుళ్లు, దేవతల్లాగా కాకపోయిన కనీసం తోటి మనిషిలాగా చూడాలని కోరారు. మనిషిని అనారోగ్య సమస్యల నుంచి రక్షించేది వైద్యులేనని చెప్పారు. నిద్రాహారాలు మాని రోగుల సేవల్లో వైద్యులు ఉంటారని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి చంపడం అమానుషమని ఖండించారు. ఈ దారుణంపై సమాజం సిగ్గు పడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల పరిసరాల్లో ఆల్కహాల్‌ను నిషేధించాలని ప్రభుత్వాలను కోరారు. వైద్య వృత్తిలో ఉన్నవారిపై దాడులు జరుగకుండా నిలువరించేలా కేంద్రం కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఘోరమైన సంఘటన

కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వతనేని నాగశ్రీహరిత మాట్లాడుతూ చరిత్రలో ఇప్పటి వరకు ఇలాంటి ఘోరమైన సంఘటన జరగలేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా తక్షణమే ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని కోరారు. డ్రగ్స్ వినియోగం కూడా వైద్యురాలిపై హత్యకు కారణమని వెల్లడించారు. నిందితుల్ని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ వైద్యురాలి హత్యను నిరసిస్తూ వైద్య రంగంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమకు సంఘీభావం తెలిపేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

మహిళలకు ప్రత్యేక గదులు కేటాయించాలి

ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ ఆళ్ల ప్రశాంతి మాట్లాడుతూ మహిళలకు పనిచేసే ప్రదేశాల్లో ప్రత్యేక గదులు కేటాయించాలని కోరారు. ఈ సంఘటన చూసి ప్రతి ఒక్కరూ సిగ్గుపడాలని, నిందితులకు శిక్షపడే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. పలు సంఘాల నేతలు, ఐఎంఏ నేతలు ర్యాలీలో పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో నిరసనల సెగ

మంగళగిరి: కోల్‌కతాలో పీజీ చదువుతున్న మెడికల్ విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడ్డ వారిని శిక్షించాలంటూ మంగళగిరి ఎయిమ్స్ విద్యార్థుల ఉద్యమం తీవ్ర మవుతోంది. గత కొద్ది రోజులుగా సాగుతున్న ఉద్యమం ఎయిమ్స్ క్యాంపస్‌కు మాత్రమే పరిమితమైంది. కాగా శనివారం విద్యార్థులు రోడ్డుపై నిరసన తెలిపారు. హత్యకు పాల్పడ్డ యువకుడుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలంటూ పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో శనివారం విద్యార్థులు మానవహారంగా ఏర్పడి, నిరసన తెలిపారు. ఉయ్ వాంట్ జస్టిస్.. ప్రభుత్వ ఉదాసీన వైఖరి విడనాడాలి అంటూ నినాదాలతో బస్టాండ్ ప్రాంతం మారుమోగింది. గౌతమబుద్ధా రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. శనివారం ఉదయం నుంచే ఓపీని నిలిపి వేశారు. ఆసుపత్రికి వచ్చిన వారిని సెక్యూరిటీ సిబ్బంది గేటు నుంచే వెనుకకు పంపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ మనుషులు ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకుండా పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉదాసీన వైఖరి కారణంగానే వైద్యులు, వైద్య విద్యార్థులపై దాడులు పెరుగుతున్నాయని విమర్శించారు. వైద్య విద్యార్థినిపై దుండగుడు అమానుషంగా అత్యాచారానికి పాల్పడి హత్య చేయడం అమానవీమని ఖండించారు. ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నిర్మానుష్యంగా ఓల్డ్ క్లబ్ రోడ్డు

గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్‌రోడ్డు శనివారం నిర్మానుష్యంగా మారింది. నిత్యం అంబులెన్సులు, రోగుల వాహనాలతో రద్దీగా ఉండేది. ఆసుపత్రులు బంద్ పాటించి వైద్య సేవలు నిలిపివేయడంతో ఓల్డ్ క్లబ్ రోడ్డు బోసిపోయింది. కరోనా సమయాన్ని తలపించింది.



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, వైద్యులు

సాగునీటి కోసం
రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

తెనాలి రూరల్ / పెదకాకాని : పొలాలకు నీరందడంలేదంటూ తెనాలి మండలం ఖాజీపేట వద్ద పలు గ్రామాలకు చెందిన రైతులు శనివారం ఆందోళన నిర్వహించారు. తంగెళ్లమూడి, హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామాలకు చెందిన రైతులు మండుటెండలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. హైలెవల్ చానల్ నుంచి దిగువకు నీరు రావడం లేదని, ఫలితంగా వేలాది ఎకరాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయి కిలోమీటరు మేర బారులుదీరాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కె.వి. గోపాలకృష్ణ, దుగ్గిరాల ఇరిగేషన్ అధికారులు, రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే, రైతులు ససేమిరా అంటూ ఆందోళన కొనసాగించారు. 'మా బాధలు ఎవరూ పట్టించుకోరా? నీరు ఇవ్వకపోతే పంటలు ఎలా పండిస్తామంటూ ?' పలువురు ఆవేదన వ్యక్తపరిచారు. మంత్రి నాదెండ్ల మనోహర్ వెంటనే ఇక్కడకు వచ్చి సమస్య పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. హైలెవల్ చానల్ నుంచి నీరు విడుదల చేయకపోవడం వల్ల నాలుగు నుంచి ఐదు వేల ఎకరాలు ఎండిపోతున్నాయని, తాము పంట నష్టపోవాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్ గోపాలకృష్ణ తమకు ఒకరోజు సమయం ఇవ్వాలని కోరారు. ఆదివారం సాయంత్రం నాటికి నీరు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం సాయంత్రానికి నీరు ఇవ్వకపోతే నందివెలుగు జంక్షన్ వద్ద పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆదివారం స్థానిక రైతులతో పాటు దుగ్గిరాల రైతులతో సమావేశం నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ తెలియజేశారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

క్లుప్తంగా

ఉత్తమ టీచర్ల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న నిర్వహించనున్న జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఈనెల 22లోపు దరఖాస్తుల్ని సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులతో పాటు హెచ్ఎంలు అందజేసిన దరఖాస్తుల్ని ఎంఈవోలు పరిశీలించిన తరువాత ఈనెల 24లోపు సంబంధిత ఉప విద్యాశాఖాధికారులకు పంపాలని సూచించారు. ఉప విద్యాశాఖాధికారులు వాటిని ఈనెల 27లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలని తెలిపారు. దరఖాస్తుదారులు కనీసం 15 ఏళ్ల బోధన అనుభవంతో పాటు ఎటువంటి క్రమశిక్షణా చర్యలకు లోనై ఉండరాదని తెలిపారు. ఉప విద్యాశాఖాధికారులు దరఖాస్తుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే డీఈవో కార్యాలయానికి పంపాలని ఆమె స్పష్టం చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పట్నంబజారు: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టాభిపురం ఒకటో లైనులో ఉన్న జైకిసాన్ స్వీట్స్ షాపులో శ్రీదేవి పని చేస్తోంది. అదే కంపెనీలో పనిచేస్తున్న మేనేజర్ వెంకటేశ్వరరావు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న క్రమంలో ఇదేమని అడగటానికి భర్త, దళిత సంఘ నేతలు వెళ్లారు. వారిని కూడా కులం పేరుతో దూషించిన నేపథ్యంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ, కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

48 పరుగుల ఆధిక్యంలో అనంతపురం

ఒక రన్‌తో సెంచరీ మిస్ అయిన ప్రశాంత్

మంగళగిరి: ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతున్న అండర్ -19 మెన్ మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్స్ క్రికెట్ మ్యాచ్‌లో ఈస్ట్ గోదావరి జట్టుపై అనంతపురం జట్టు 48 పరుగులు ఆధిక్యత సాధించింది. టాస్ గెలిచిన ఈస్ట్ గోదావరి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన అనంతపూర్ జట్టు 44.1 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌మేన్ బి. ప్రశాంత్ రెండు సిక్స్‌లు 15 ఫోర్లతో 99 పరుగులు చేసి ఒక రన్‌తో సెంచరీ మిస్ అయ్యాడు.ఈస్ట్ గోదావరి జట్టు బౌలర్లు ఏ.వి.ఎన్. లోహిత్, ఏ. అనిల్‌కుమార్ చెరో వికెట్ తీశాడు.అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఈస్ట్ గోదావరి 43 ఓవర్లలో ఏడు వికెట్లతో 157 పరుగులు చేసింది.అనంతపూర్ జట్టు బౌలర్ ఐదు వికెట్లు తీసి రాణించాడు.

సర్టిఫి'కేటు' చెరలో విద్యార్థినులు

- ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో పరిస్థితి
- సర్టిఫికెట్లు జారీలో అధికారులు, సిబ్బంది చేతివాటం

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవినీతి రాజ్యమేలుతోంది. చిన్న సర్టిఫికెట్ కావాలన్నా చేతులు తడపాల్సిందే. విద్యార్థినులకు టీసీ కూడా మంజూరు చేసేందుకు సిబ్బంది రూ. వెయ్యి వసూలు చేస్తున్నారు. గత మూడు రోజులుగా కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినులకు టీసీలు ఇస్తున్నారు. ఓ విద్యార్థినికి టీసీ ఇచ్చేందుకు జాప్యం చేయడంతో ఆమె సంబంధిత అధికారుల్ని ప్రశ్నించింది. తాను కూడా అందరిలాగే బోధనా సిబ్బందికి రూ. వెయ్యి చెల్లించానని, తక్షణమే తనకు టీసీ ఇవ్వాలని కోరడంతో వసూళ్ల దందా వెలుగులోకి వచ్చింది.

అడ్మిషన్ సమయంలోనూ ఇదే తంతు

గోరంట్లలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఏడాది 50 మంది చొప్పున రెండు విభాగాల్లో చేర్చుకుంటారు. ఇటీవల బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు మూడు రోజులుగా టీసీలు మంజూరు చేస్తున్నారు. వీటిని ఇచ్చేందుకు బోధనా సిబ్బంది రూ. వెయ్యి చొప్పున ప్రతి విద్యార్థిని నుంచి వసూలు చేశారు. ఫైనల్ ఇయర్ పరీక్షలకు ముందు ఫేర్‌వెల్ కార్యక్రమం పేరిట రూ. 3వేలు చొప్పున వసూలు చేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. హెల్త్ యూనివర్సిటీ నిబంధనల మేరకు ఫీజులు కట్టి కళాశాలకు



గోరంట్లలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

వచ్చినప్పటికీ ఒక్కో విద్యార్థిని వద్ద పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో రూ. 6వేల నుంచి రూ. 8వేల వరకు బోధనా సిబ్బంది వసూలు చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. అయినప్పటికీ ఫలితం లేదు. నర్సింగ్ కళాశాల బోధన సిబ్బంది తీరు మార్చుకోవడం లేదు. విద్యార్థుల్ని ప్రతి నెలా ఏదో ఒక కార్యక్రమం పేరుతో ముక్కు పిండి వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు.

బస్సు కోసం తిప్పలు

బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు ప్రతిరోజూ క్లినికల్ క్లాసుల కోసం గుంటూరు జీజీహెచ్‌కు వెళుతున్నారు. అయితే, వెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం లేదు. తొలుత నర్సింగ్ కళాశాలను 2013లో గుంటూరు జీజీహెచ్‌లో ప్రారంభించారు. నూతన భవనాన్ని 2019లో గోరంట్లలో నిర్మించి, అక్కడకు విద్యార్థినులను తరలించారు. భవన నిర్మాణ సమయంలో కొంత నగదు మిగలడంతో నాటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ బస్సు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. అయితే, నర్సింగ్ కళాశాల అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థినులకు ప్రతిరోజూ బస్సు కోసం తిప్పలు తప్పడం లేదు. హాస్టల్‌లో ఉండి, చదువుకుంటున్న వారు రోజూ సొంత డబ్బులు వెచ్చించి ప్రైవేటు బస్సుల్లో గుంటూరు జీజీహెచ్‌కు గోరంట్ల నుంచి వస్తున్నారు. విద్యార్థులతో పాటు జీజీహెచ్‌కు వచ్చి వారికి సందేహాల్ని నివృత్తి చేయాల్సిన బోధన సిబ్బంది జీజీహెచ్‌లో పూర్తి సమయం ఉండకుండా వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సొంత పనుల్లో సిబ్బంది బిజీ

కళాశాలలో 12 మంది ట్యూటర్లు, ఆరుగురు లెక్చరర్లు, ఎనిమిది మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ప్రొఫెసర్లు ఉన్నారు. ఇంత మంది బోధన సిబ్బంది ఉన్నా క్లినికల్ క్లాసుల్లో విద్యార్థులను పట్టించుకోకుండా సొంత పనులపై బయటకు వెళ్లడం విమర్శలకు తావిస్తోంది. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న వారిలో అత్యధికం గ్రామాల నుంచి వచ్చిన వారో లేదా ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థినులే ఉన్నారు. వీరంతా ప్రతిరోజూ బస్సు చార్జిల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దాతల సాయంతో బస్సు ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతోందని విద్యార్థులు వాపోతున్నారు. హాస్టల్‌లో భోజనం సైతం మెరుగ్గా ఉండేలా చూడాలని, ప్రతినెలా వేడుకల పేరిట డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

21న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

తెనాలి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఆగస్టు 21న జరగనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక అయితానగర్‌లో రాష్ట్ర దళిత నాయకుడు పిల్లి విద్యాసాగర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో భారత్‌బంద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం చంద్రబాబునాయుడు మదిలో పుట్టిన కుట్ర అన్నారు. రాజకీయ దురుద్దేశంతో మాదిగలను ప్రోత్సహిస్తూ వర్గీకరణకు తెరలేపారన్నారు. చంద్రబాబుకు తొత్తులుగా వ్యవహరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకుల ధోరణి సరికాదన్నారు. 59 ఉపకులాలతో ఐకమత్యంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలను చీల్చడం సమంజసం కాదనీ, దక్షిణ భారత దేశానికి చెందిన 103 మంది మాదిగ, మెహర్ల ఎంపీలు పార్లమెంటులో సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నారని చెప్పారు.



కరపత్రాన్ని ఆవిష్కరించిన జేఏసీ నాయకులు

అంబేడ్కరైట్ ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్ కుమార్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, మొదటి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక హైకోర్టు పిటిషనర్ గెడ్డటి సుందర్ సునీల్ మాట్లాడారు. కార్యక్రమంలో కారుమంచి రవికుమార్, బొనిగల ప్రదీప్, వేము సమత, దేవరపల్లి వీరయ్య, మధిర నాగేశ్వరరావు, బేతాళ రత్నరాజు, కె. మణికుమార్, కె. వెంకటేశ్వరరావు, బి. రాజశేఖర్, అంబటి ఏసుబాబు, ఆరిగ ప్రసాద్, పిల్లి తిమోతి, పిల్లి దాసు పాల్గొన్నారు.

ఆటోల యూనియన్‌లతో డీటీసీ సమావేశం

విద్యార్థులను అధిక సంఖ్యలో తరలిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: విద్యార్థుల్ని పరిమితికి మించి ఆటోలో తరలిస్తున్న అంశంపై శనివారం 'సాక్షి'లో 'ప్రమాదం అంచున ప్రయాణం' పేరుతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్టీఏ అధికారులు స్పందించారు. స్వర్ణభారతీనగర్‌లోని డీటీసీ కార్యాలయంలో శనివారం ఆటో యూనియన్ నాయకులు, ఆటోడ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థుల్ని ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల్లో 12 సంవత్సరాల్లోపు విద్యార్థుల్ని ఆరుగురికి మించి ఎక్కించకూడదని, స్కూల్ బ్యాగు, లంచ్‌బాక్సులు ఆటో బయట వేలాడదీయరాదని చెప్పారు. ఆటోల వెనుక డోర్ తీసి, డ్రైవర్ల పక్కన విద్యార్థుల్ని కూర్చొబెట్టకూడదని తెలిపారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటామని, ఇకపై తనిఖీలు ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు.



ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీం

బాలికపై అత్యాచారం

కేసు నమోదుచేసిన పట్టణ పోలీసులు

బాపట్లటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన బాలికపై అదే ప్రాంతానికి చెందిన బాలుడు అత్యాచారం చేసిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. అత్యాచారం జరగడంతో బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాంత్ పాణినికి నాసా అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన యువ ఖగోళ, భౌతిక శాస్త్రవేత్త సింగం శ్రీకాంత్ పాణిని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) నుంచి అవార్డు అందుకున్నారు. నూతన ఆవిష్కరణల విభాగంలో ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైన శ్రీకాంత్ పాణిని యూఎస్ఏ అలబామాలోని హన్స్‌వెల్లేలో గురువారం జరిగిన కార్యక్రమంలో మార్షల్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ జోసఫ్ పా ప్రై చేతుల మీదుగా ఘన సత్కారాన్ని పొందారు. గుంటూరు నగరానికి చెందిన హిందూ కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు, సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ కుమారుడు శ్రీకాంత్ పాణిని నాసాలో కొన్నేళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. విశ్వంలోని సుదూర ప్రాంతాలపై పరిశోధనలు చేస్తూ, సరిహద్దులను ఛేదించి సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ఖగోళ శాస్త్ర పరిశోధలకు గాను తాను అవార్డు అందుకున్నట్లు పురస్కార గ్రహీత శ్రీకాంత్ పాణిని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనలపై నాసాకు వందల కొద్దీ ఎంట్రీలు వచ్చినప్పటికీ శ్రీకాంత్ పాణిని అవార్డు వరించడం భారతీయులందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా శ్రీకాంత్ పాణినికి గుంటూరు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు అభినందనలు తెలియజేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3500, గరిష్ట ధర రూ.5800, మోడల్ ధర రూ.4700 వరకు పలికింది.

24న విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహా రాక
- ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు ప్రదానం

చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. యూనివర్సిటీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ, గౌరవ అతిథులుగా హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరిరావు, హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వరరావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి) హాజరవుతున్నారని పేర్కొన్నారు. 12వ స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ 1,526 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వైస్ చాన్స్‌లర్ తెలిపారు. 26 మంది విద్యార్థులకు బ్రాంచ్‌ల వారీగా అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు అందజేస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ మెడల్, ఎండోమెంట్ అవార్డులు, బహుముఖ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి బంగారు పతకం, బెస్ట్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సోషల్ ఎంగేజ్‌మెంట్ అవార్డు, బెస్ట్ లీడర్ మెడల్స్ ఉంటాయని వివరించారు.



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న వైస్ చాన్స్‌లర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్

ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు

స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్ యూనివర్సిటీ వివిధ రంగాలలో అందించిన సేవలు, కృషికి గాను ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేయనుందని వైస్ చాన్స్‌లర్ తెలిపారు. దొంతినేని శేషగిరి రావు, ముల్లపూడి లోకేశ్వరరావు, కోటిలకు గౌరవ డాక్టరేట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. స్నాతకోత్సవంలో విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్. రఘునాథన్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బదిలీపై వెళ్తున్న పోలీస్ అధికారులకు సత్కారం

నగరంపాలెం: సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తించారని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ప్రశంసించారు. జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న ఏఎస్పీలు ఎస్.నచికేత్ విశ్వనాథ్, ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీలు మహబూబ్‌బాషా, వి.వి.నాయుడు, రవికుమార్, మహేష్‌ను శనివారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాలులో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీలు ఎం.వెంకటేశ్వరరావు, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



నచికేత్ విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న ఐజీ, జిల్లా ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



దుర్గాప్రసాద్ మృతదేహం



వెంకటేశ్వరరావు మృతదేహం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

తెనాలి రూరల్: అతివేగం, రోడ్డుపై అవగాహన లేకపోవడంతో కారు అదుపుతప్పి గోడను ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తెనాలి శివారు పెదరావూరు వద్ద శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదకాకానికి చెందిన దుర్గాప్రసాద్(33) ఏడాది కిందట కారు కొని బాడుగులకు తిప్పుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక గుంటూరు నుంచి వెల్లటూరుకు బాడుగకు వచ్చాడు. ప్రయాణికులను దింపి తిరిగి వెళ్లే క్రమంలో వెల్లటూరుకు చెందిన గుంటూరు వెంకటేశ్వరరావు(50)ను ఎక్కించుకున్నాడు. వీరు ప్రయాణిస్తున్న కారు తెనాలి సమీపంలోని పెదరావూరు గ్రామ శివారుకు చేరుకోగానే అదుపు తప్పి, రోడ్డు వెంబడి ఉన్న గోడకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు 108, పోలీసులకు సమాచారమందించారు. కారులో ఇరుక్కున్న మృతదేహాల్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంకటేశ్వర్లుకి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. వెల్లటూరులో నివాసం ఉంటూ తెనాలిలో వాచ్‌మేన్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అత్యధిక కేసులు పరిష్కారానికి కృషి

రేపల్లె రూరల్: మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి, కక్షిదారులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు పనిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సబ్ కోర్టు ప్రాంగణంలో సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని కోరుతూ డివిజన్ పరిధిలోని పోలీసులతో శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి, కక్షిదారులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో న్యాయశాఖ లోక్ అదాలత్ నిర్వహిస్తోందన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు